

# కోనేరూ – కోమలీ

పి.సరళాదేవి

రాజేంద్రకృష్ణ పుంగనూరు వచ్చి మూడు రోజులైనది. వచ్చిన దగ్గర్నించీ సామానంతా కట్లువిప్పి సర్దుతున్న అమ్మకు సహాయపడడంలోనే సరిపోయింది. ఆ రోజు ఇంకే పనీ లేకపోవడంతో సాయంత్రం పూరు చూద్దామని బయల్దేరాడు. కుమ్మరి వీధి నుంచి బయలుదేరినవాడు అలా అలా తిరిగి, రోడ్డు కిరుప్రక్కలా వున్న బూరుగు చెట్లను చూస్తూ సినిమాహాలు చేరుకున్నాడు. అక్కడినించి వెళ్ళి బస్‌స్టాండంతా ఓసారి కలయతిరిగి బజార్లో కొచ్చాడు. షాపులన్నీ చూస్తూ బ్రాహ్మణవీధిలోనించి తిన్నగా నడిచేసరికి చెరువుగట్టు తగిలింది. చెరువుగట్టమ్మట కొంత దూరం నడిచివద్దామనుకుని, కుడిచేతిప్రక్క తిరిగి పది గజాలు నడిచాడు. అంతే...

కోనేరు! చూస్తూంటే కళ్ళు మిరుమిట్లు గొల్పుతోంది. ఎంతటి సృష్టి...? ఏమి సౌందర్యం...!? అద్భుతం! అసమానం! అసలు ఇది మానవ సృష్టేనా అని - చక్కనమ్మ చిక్కినా అందమేనన్నట్లు ఓ ప్రక్క శిథిలమై పోతూన్నా సౌందర్యం పోలేదు. ప్రాకారానికి నలుమూలల్లోవున్న పెద్ద పెద్ద గుండ్లు దూరాన్నించి చూస్తోంటే ముచ్చటేసింది. ఆ ప్రాకారాన్నికున్న ద్వారాలమీదుగా తలల్లేని విగ్రహాలున్నాయి. ప్చ్...ఎన్నాళ్ళయిందో మరి కట్టించి! ద్వారం దాటాడు. కళ్ళు గిరుక తిరిగాయి. మెట్లు, ఒక చదరంలో ఇంకో చదరం. అందులో ఇంకో చదరం. ఇలా అమర్చినట్లు చూడ్డానికి గమ్మత్తుగా వున్నాయి. ఓ ప్రక్క హరికథా కాలక్షేపానికి ఏదో మంటపం బావుంది. ఈ మెట్ల మీద కూర్చుని ఎంత ప్రజ లయినా హాయిగా వినవచ్చు. కోనేటి మధ్య ముద్దులు మూట గట్టే గోపురం.

చకచకా మెట్లుదిగాడు. చిన్న ప్రాకారం మోకాలికి కొట్టుకుంది. వర్షాలవి సవ్యంగా పడితే ఆ ప్రాకారం వరకూ నీరు వస్తుందన్నమాట. ఆ ప్రాకారానికి నాలుగు దారులు. దారి కిరుప్రక్కలా నలుపు రంగులో మెరుపు లేక పోలేదని ఋజువుచేసే నల్లని రాతిగుండ్లు.

అంతా ఓసారి తిరిగేశాడు. కోనేటి కెదురుగా వెంకటేశ్వర్ల ఆలయం. కోనేటిలోపలి ద్వారాల్లోంచి వెళితే శివాలయం. శివాలయం చుట్టూ తులసికోట. బావి, యాత్రికులు కూర్చోడానికి స్థలం. నంది విగ్రహం, ధ్వజస్తంభం, ఆంజనేయులకు కట్టిన ఓ చిన్నగుడి, ఓ ప్రక్కగా కొన్ని పాడుపడిన విగ్రహాలు పెట్టివున్నాయి.

ఇదంతా చూస్తూ బోలెడంత ఆశ్చర్యంతో నిలుచుండిపోయాడు. ఆనందంతో మనసు పరవళ్ళు తొక్కింది. చీకట్లు కమ్మడం చూచి మనసు రాక, నిలువలేక మెల్లిగా ఇంటికి చేరుకున్నాడు.

కథానిక

ఇంటిదగ్గరున్నాడే గాని కోనేరు కళ్ళల్లో మెదులుతోంది. అసలే కవితా హృదయమాయె-సంతోషం వచ్చినా, విచారం వచ్చినా పట్టలేదు. అందులోనూ

అత్యంతాద్భుతాలయిన ప్రేమ గాథలను చిత్రించడంలోనూ, చదవడంలోనూ డక్కామక్కీలు తిని స్థిరుడైనాడని అనుకుంటున్నాడు కూడా.

అందుకనే 'అంత చక్కని కోనేరు! ఓ పూర్వ కథ వుండకపోతుందా? ఏ ప్రేయసీ ప్రియుల ప్రణయానికి నాంది పలికిందో ఆ కోనేరు. ఏ ప్రణయ జీవుల రహస్యాలను తన గర్భంలో పదిల పరచిందో? ఏ ప్రణయజీవులు స్వేచ్ఛగా ఆ కోనేటి గట్టున విహరించారో? ఆ ప్రణయగాథను రసవత్తరంగా చిత్రించి పాఠక లోకానికందించాలి' అనే ఆలోచన కలిగింది.

వచ్చి మూడు రోజులయినా ఇంకా ఎవ్వరినీ పరిచయం చేసుకోనందుకు తనను తనే తిట్టుకున్నాడు. ఎవరైనా అడిగి ఆ ప్రణయగాథను తెలుసుకొని ఓ చక్కని పెద్దకథ వ్రాయాలి.

* * *

పౌర్ణమి కోసం ఎదురుచూస్తున్న రాజేంద్ర కృష్ణకు ఆరోజు పర్వదినం. ఎప్పుడు రాత్రవుతుందా, నిండు వెన్నెల్లో, ఆ కోనేటిని తనివితీరా ఎప్పుడు చూదామా అని ఉదయంనించి ఆత్రుత పడుతున్నాడు.

రాత్రికాగానే భోజనంచేసి కోనేటి విహారానికి బయలుదేరాడు. ఆ పౌర్ణమిచంద్రుని ప్రభావమో, కోనేటి కోమలత్వమోగాని దేవేంద్ర లోకంలో విహరిస్తున్నట్టుంది రాజేంద్రకృష్ణకి.

కోనేటి మధ్యనున్న గోపురపు నీడలు కోనేటి నీళ్ళలో దోబూచు లాడుతూంటే — ఏ అజ్ఞాత స్త్రీయో ఈ కోనేటి నీళ్ళల్లో కనిపించి, ఇక్కడ జరిగిన ప్రణయగాథను తనకు చెప్పకూడదా అనిపించింది. పాలుగారే వెన్నెల్లో పాలరాతిలా మెరుస్తున్న ఆ కోనేటి మెట్లను చూస్తూంటే-పట్టు పరుపులు, పూలపాన్పులు ఎందుకు? నిశ్చింతగా ఈ మెట్లమీద నిద్రపోవాలనిపిస్తుంది.

ఇలాంటి ఎన్ని వెన్నెలరాత్రుల్లో చూశారో ఆ ప్రణయజీవులు. ఈ మెట్లమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ, అనంతమైన ఆ దినాల్ని ఎంత త్రుటిలో గడిపేశారో...వారి ప్రణయ ఫలితమేమైనా, ఆ వెంకటేశ్వరుని సాక్షిగా, ఆ కోనేటి గట్టునే ప్రణయ జీవితాన్ని గడిపిన వారదృష్టవంతులు. ఒక్క నిట్టూర్పు విడిచాడు.

క్రిందిమెట్టుమీద ప్రియుని సరసనే కూర్చుని కోనేటినీళ్ళలో కాళ్ళాడిస్తూ, పరిపూర్ణ హృదయంతో, కోకిల కంఠంతో, ఎన్ని ప్రణయగీతాలాలపించిందో, ఆ ప్రేయసి ధన్యురాలు!

కొలనుగట్టున కలువపూవు నీళ్ళలో ఆడిస్తూ, ప్రియుండిరాకను ప్రేయసి ఎంతగా కాంక్షిస్తుందో చెబుతూ, 'మనసున మల్లెలమాల లూగెనె, కన్నుల వెన్నెల డోలలూగెనె...' అంటూ పాడుతున్న మల్లేశ్వరి జ్ఞాపకమొచ్చి ఆనందంతో అతని కళ్ళు చెమర్చాయి. ఎంతటి ప్రణయజీవులు!

"మనసున మల్లెల..." ఎత్తాడు. కాని సంతోషంలో గొంతు గద్గదికంగా రావడంతో ఆపేశాడు. ఎందుకో తనకాపాట అంటే అంత ఇష్టం!

అలా లోపలికి వెళ్ళాడు. శివకోవిలకు ప్రక్కగా బావి, ప్రక్కనే పశువులు తాగడానికో నీళ్ళతొట్టె, చుట్టూవున్న స్థలంలో అక్కడక్కడ కొన్ని పూలమొక్కలు. మల్లేశ్వరిలా రోజూ ఈ మొక్కలకి నీళ్ళు పోసి పెంచుతుండేదేమో? దాహంతో వచ్చే పశువులకి ఈ తొట్టెనిండా నీళ్లు పోసేదికదూ?

ఆ బావి చప్టామీద, ఆనందపారవశ్యంలో మాటలురాక, మౌనంగా కూర్చుని ఎంతసేపు గడిపేవారో-ఆ ప్రేయసీ ప్రియులు.

ఈ శివాలయపు గోడలూ, విగ్రహాలూ, ఆ ప్రేయసీ ప్రియుల ప్రణయఘట్టాలను ప్రతిఫలింపజేస్తే ఎంత బాగుండును! వెంటనే పాఠక హృదయాలకు హత్తుకుపోయేటట్లు చేద్దునుగదా...అనుకుంటూ మెల్లిగా వచ్చి ఆ కోనేటి మెట్లమీద కూర్చున్నాడు. అలా ఎంతసేపు కూర్చున్నాడో ఏమో...నగరిలో కొడుతున్న పదకొండు గంటలు విని ఉలిక్కిపడి లేచి ఇంటిదారి పట్టాడు.

పొద్దు పొడిచింది మొదలు ఇదే ఆలోచనగా ఉంది. ఎలాగైనా ఆ గాథ తెలుసుకొని లోకానికి చాటాలి. ఎవరినైనా అడుగుదామంటే అంత ఎక్కువ పరిచయం ఎవరితోనూ కాలేదు.

మెల్లిగా పరిచయాలు ఎక్కువ అవుతున్నాయి. ఎవరితోనైనా మాట్లాడుతూ, మాట్లాడుతూ "అన్నిటి మాటకేంగాని—మీ వూళ్లో కోనేరు

మహాద్భుతంగా ఉందండి" అంటున్నాడు. ఆ విషయం మొదలుపెడితే ఆ గాథ బయటికొస్తుందేమోనని. కాని అతని ఆశలన్నీ నిరాశలే అవుతున్నాయి. ప్రతివారూ నవ్వేస్తున్నారేగాని ఏమీ చెప్పడంలేదు! వారి ఆ నవ్వుల్లో ఏదో సవాలు కనిపించిందతనికి.

తను రచయిత అని తెలిసిపోయింది. ఈ వూరి వాళ్ళు కాకుండా పరాయి వూరివాడు వచ్చి రాయడమా అని అనుకుంటున్నారేమో. అందుకనే తనకా గాథ తెలియకుండా వీళ్ళందరూ సమ్మె చేస్తున్నారా? చూద్దాం. ఎలాగైనా ఆ గాథ తెలుసుకొని వ్రాసి పాఠకలోకంచేత ప్రశంసలందుకుంటే-కుక్క కాటుకి చెప్పుదెబ్బవుతుంది.

• • •

ఈ వూళ్ళో పుట్టి పెరిగినవాడిని ఆప్త మిత్రుడుగా సంపాదించి, అతని సహాయంతో ఆ గాథ పైకి లాగాలనుకున్న రాజేంద్రకృష్ణకి-ప్రసాదు దొరకడంతో ప్రాణాలు లేచివచ్చాయి.

ఓ ఆదివారం సాయంత్రం అలా జంగాలపల్లె వైపు ఆంజనేయస్వామి కోవెలకు వస్తూ ధైర్యం చేసి అడిగేశాడు రాజేంద్రకృష్ణ కోనేటి గాథ చెప్పమని—

"ఏ కోనేటి గాథ?" అంటూ ఆశ్చర్యపోయాడు ప్రసాద్.

"వెంకటేశ్వర ఆలయందగ్గర కోనేరు లేదూ... అదే ఆ కోనేటిదగ్గర జరిగిన ప్రణయగాథ."

"ప్రణయగాథా" మరింత విస్తుపోయాడు.

"ఏమిటంత విస్తుపోతావు?"

నాలుగూ చదివి, నలుగురితో తిరిగినవాడు కాబట్టి, కాస్త అర్థం చేసుకుని "ఇక్కడ ఏ ప్రణయగాథలూ జరగలేదే" అన్నాడు.

"నువ్వూ నామీద కత్తిగట్టావూ? అయితే సరే. నీకో నమస్కారం" అనేశాడు విసురుగా రాజేంద్ర. ప్రసాదుకేమిటో అయోమయంగా ఉంది.

కోనేటికి తీసుకుపోయి అక్కడొకచోట కూర్చోబెట్టి, ఏమిటి సంగతని అడిగాడు. రాజేంద్ర కొంతసేపటివరకూ ఏమీ మాట్లాడలేదు. తరువాత అక్కడ ప్రతివస్తువునూ నిదర్శనగా చూపి, ఏదో ప్రణయగాథ జరిగుండాలనీ, అది చెప్పమనీ బ్రతిమాలాడు.

"మనకు నచ్చిన ప్రతిచోటా ఏదో ప్రణయగాథ జరిగుండాలన్న నమ్మకం ఏమిటి?" అడిగాడు ప్రసాద్.

"ఏమో—ఎక్కడైనా జరిగిందో లేదో నాకు అనవసరం గాని, ఇక్కడ మాత్రం జరిగుంటుందని నిశ్చయంగా చెప్పగలను."

"నువ్వనుకోగానే సరా... ఇక్కడ ఏమీ జరగలేదు. ఎవరూ అనుకోగా వినలేదు కూడా."

"జరక్కపోవడం కాదు. నే నెక్కడ ఆ గాథ వ్రాసి పేరు సంపాదించేస్తానో అని-మీరంతా నామీద కత్తిగట్టి చెప్పడం మానేశారు" విసుగుగా లేచి ప్రసాద్ పిలుస్తున్నా వినకుండా తొందరగా వెళ్ళిపోయాడు రాజేంద్రకృష్ణ.

తరువాత ప్రసాదు ఎన్నిసార్లు నచ్చచెప్పినా వినలేదు. అక్కడ ప్రణయగాథ జరిగుంటుందనే అతని నమ్మకం సడలిపోలేదు. ఈ కొత్తరకం పిచ్చి ఏమిటో చూదామనుకున్నాడు ప్రసాదు.

ప్రేయసిని చూడడానికి అల్లాడిపోయే ప్రియుండిలా కోనేరుని చూడకుండా ఒక్కరోజుండలేడు రాజేంద్రకృష్ణ. వెన్నెల ప్రారంభమయితే రాత్రి ఎనిమిది గంటలకు వెళ్తాడు. లేకపోతే సాయంత్రం ఓసారి చూచివచ్చేస్తాడు. ఆ ప్రణయగాథ జరిగిందో లేదోగాని అతని కలవరింతమాత్రం విపరీతంగా వుంది. ఇతని అవస్థ చూసి—

"ఆ ప్రణయగాథ తెలుసుకున్నానుగాని ఇప్పుడు చెప్పను" అన్నాడు ప్రసాదు. ఎగిరి గంతేశాడు రాజేంద్ర. వెంటనే చెప్పమని ప్రాధేయపడ్డాడు, బ్రతిమాలాడు, కసిరాడు, కాని ఎన్ని చేసినా చెప్పడాని కొప్పుకో లేదు ప్రసాదు. పోనీ ఎప్పటికైనా చెబుతాడు కదా అని తృప్తిపడ్డాడు రాజేంద్రకృష్ణ.

* * *

ప్రణయానికీ, చందమామకీ ఏమిటీ అవినాభావ సంబంధం? ఆ రెండూ తోబుట్టువులా? లేకపోతే వెన్నెలలో అదృశ్య ప్రేమఘట్టాలు చూస్తున్నామా? నక్షత్రాలను లెక్క పెట్టబోతే ఎంత ఫలమో - పౌర్ణమి చంద్రుడు ఎన్ని ప్రేమలకు నాంది పలి

కాడో, ఎన్ని ప్రణయ సుఖాలను చూశాడో లెక్క వేయబోయినా అంతే ఫలం కాదూ! అసలు పౌర్ణమి చంద్రుడు తలచుకుంటే ఎన్ని ప్రణయ గాథలను రసవత్తరంగా చిత్రించి మనస్సులకు హత్తించగల్గే వాడో యేమో!

ఓ పౌర్ణమినాడు ఏడు గంటలకే భోజనం చేసేసి, కోనేటికి వచ్చేశాడు రాజేంద్రకృష్ణ. అప్పటికి నీళ్ళకు వచ్చినవాళ్లు కాస్త ఎక్కువగానే ఉండడం చేత దూరంగావెళ్ళి కూర్చున్నాడు. వాళ్ళు పల్చబడిన తరువాత వచ్చి కోనేటి నీళ్ళకు రెండు మూడు మెట్లకుపైన కూర్చుని, నీళ్ళల్లోకి చూస్తూ, ప్రసాదు చెబుతానన్న ప్రణయ జీవులకు రూప కల్పన చేస్తూ కూర్చున్నాడు.

ఇంతలో ఎదురుగా కోనేటి నీళ్ళ చిన్న చిన్న అలలలో ఒక నీడ మెరిసింది. చటుక్కున తలెత్తాడు.

ముందుకుపడిన వాల్జడను వెనక్కుతోసి, చంక నున్న బిందె కిందికిదించి, పమిటచెంగు కొస నడుముకిదోపి, ఎడమచేత్తో బిందెముంచి బయటికిలాగి, రెండు చేతులతోనూ ఎత్తి చంకన పెట్టుకుని, ఒక్కక్షణం ఇతనిప్రక్కే చూపునిలిపి, మరుక్షణం గిరుక్కున తిరిగి వయ్యారంగా నడిచిపోతున్న కోమలిని చూస్తూ విస్తుపోయాడు.

ఎవరీమె? ఎప్పుడూ చూడలేదే! ఈ కోనేటి తల్లి చల్లని నీళ్ళుతాగి ఈ సౌందర్యం సంపాదించిందా!

రోజూ ఇతను వచ్చేప్పుడీమెకూడా వస్తోంది. కనుచీకటిపడి మనుషులు పల్చబడిన తరువాత ఆమె నీళ్ళకు వస్తుంది. అతనుకూడా ఆ సమయానికే వస్తాడు. అందుచేత ఒకరినొకరు చూచుకోవడం తప్పడంలేదు.

ఒకరోజులాగే కోనేటి నీళ్ళల్లో తననీడ చూసుకుంటున్నాడు. ఆమె నీళ్ళకు వచ్చింది. నిండు బిందె చంకన పెట్టుకుని మెట్లెక్కుతూ, ఒక మెట్టు పాదానికి తగిలించుకుని తూలి పడబోయింది. "ఆఁ ఆఁ" అని అతను కేకవేయడమూ, ఆమె ఆ చిన్న ప్రాకారాన్ని కుడిచేత్తో పట్టుకుని ఆపుకుని అతని ప్రక్కచూచి పకపక నవ్వడమూ ఒక్కసారే జరిగాయి.

ఇదే అదననుకుని అతను లేచివచ్చి "దెబ్బ తగిలిందా?" అన్నాడు.

"మీరాపుకున్నారుగా!" అంటూ నవ్వేసి వెళ్ళిపోయింది. వెంటనేవెళ్ళి చల్లని కోనేటి నీళ్ళు తాగేసి 'హమ్మయ్య' అనుకున్నాడు.

తరువాత్తరువాత ఆమె రెండుమూడు నిముషాలు మాట్లాడి మరీ వెళ్తుండేది. కోనేటి కోసం వెళ్తున్నవాడంతా ఇప్పుడు కోమలికోసం వెళ్తున్నాడు. ఆ ప్రణయగాథ విషయం అప్పుడూ అప్పుడూ ప్రసాదు నడగడమూ-చెబుతా చెబుతా అంటూ అతను రోజులు గడుపుతూండడమూ జరుగుతూంది.

ఆ ప్రణయగాథ విషయం ఆమెకేమైనా తెలిసుంటుందేమో అడుగుదామని ఓరోజు ఎదురు చూస్తూ కూర్చున్నాడు. ఆమెరాగానే—

"మీతో కొద్దిగా మాట్లాడాలి దయచేసి వస్తారా?" అన్నాడు.

"అబ్బ! ఎందుకంత మర్యాద! రమ్మంటే తీరిపోదూ." కిలకిలా నవ్వింది. ఆడవాళ్ళకి నవ్వు ఆకర్షించడానికమోఘాస్త్రం.

ఒకరు ముందు ఒకరు వెనకగావెళ్ళి శివాలయం ప్రక్క బావి చప్టామీద కూర్చున్నారు. అతనికి ఎలా మొదలుపెట్టాలో తోచలేదు.

"మాటలు వల్లెవేసుకుంటున్నారా?" అంది పమిటచెంగు నోటికడ్డం పెట్టుకుని.

"అహా" అంటూ తల విదిల్చి "ఇక్కడ జరిగిన ప్రణయగాథ మీకేమైనా తెలుసునేమో, చెబుతారని..." ఏమనుకుంటుందోనని భయంతో,సిగ్గుతో దూరంగా ఉన్న చెట్లగుంపులవైపు కళ్ళు తిప్పుకున్నాడు. ఆమె ఆశ్చర్యపోలేదు, అతన్ని మింగేసేటట్లు చూడలేదు.

"అడిగేశారూ..." అంటూ విరగబడి నవ్వేసి—

"అవునుగాని ఎందుకండీ ఈ పిచ్చి పట్టింది?" అంది.

"మీరూ అనేశారూ......కానివ్వండి ఏం చేస్తాం!" విరాగిలా మొగం పెట్టాడు. ఆమెకు జాలేసింది. కొద్దిగా ముందుకు జరిగి అతని మొగంలోకి చూస్తూ—

"ప్రణయం జరిగిందని ఎందుకనుకోవాలి? జరుగుతుందనుకోకూడదా-" అంది. అతను వింతగా ఆమె మొగంలోకి చూశాడు. ఆమె కళ్ళు వాల్చుకొని ఓ గడ్డిమొక్కను చేత్తో పీకింది.

"పోనీ. మీ పేరేమిటో చెబుతారా?" అన్నాడు ఆమెను నఖశిఖపర్యంతం వీక్షిస్తో.

"ఏం? పేరు బావుండకపోతే ప్రేమించ లేరా?" అంది వారగా చూస్తో. మీరే నయం మా కంటె, మనసులోనిది అవలీలగా వెల్లడించేస్తారు— అనుకున్నాడు.

"ప్రేమమాట ఎలా వున్నా, పేరులో కూడా ఆకర్షణుందనేది మరచిపోకూడదు" అన్నాడు అప్పటికి పూర్తిగా ధైర్యం సంపాదించి.

"ఆకర్షణలేని పేరే అయితే ఆకర్షణీయంగా చేసుకుంటారా?"

"ఓ"

"రంగమ్మ అయితే..."

"రాధ అంటాను" అన్నాడు నవ్వుతూ. తన పేరు తెలుసుకున్నాడని, ఆమె సిగ్గుపడిపోయి గభాల్న లేచి "వెళ్తున్నా" అంది. అతను తటాలున లేచి—

"రాధా" అన్నాడు. ఆమె ఆగిపోయి వెనక్కి చూచింది. బాహ్యప్రపంచం మరచిపోయి రెండు నిముషాలు ఒకర్నొకరు చూచుకోవడంలో గడపడం - ఆ శివాలయానికి మాత్రమే తెలుసు.

ఇంతలో ఓ పిట్ట అరుస్తూ వాళ్ళ తలలమీది నించి ఎగిరిపోవడంతో, ఆమె ఉలిక్కిపడి కళ్ళు వాల్చుకుని మెల్లిగా నడిచి వెళ్ళింది.

* * *

ఆ రోజామె ఇంకా రాలేదేమో అనుకుని, తిరుగుతూ శివాలయంలోకివచ్చి నంది విగ్రహం పక్కనే కూర్చున్నాడు రాజేంద్ర. తలమీద ఏదో పాకినట్టయింది. లేచి దులుపుకుని మళ్ళా కూర్చున్నాడు. మళ్ళీ ఏదో నడిచినట్టయింది. దులుపుకుని మీద నేమైనా వుందేమోనని చూశాడు. తలలో ఏవో పుల్లలు కదిలినట్లయింది. లేచి దులుపుకుంటున్నట్టు చేసి, చప్పున విగ్రహం వెనక్కి వెళ్ళి, విగ్రహం నీడలో నక్కి కూర్చున్న రాధను చూసి "అమ్మ దొంగా నీ పనేనా?" అంటూ చేయెత్తేసరికి పరుగెత్తింది రాధ.

శివాలయం చుట్టూ పరుగెత్తి పరుగెత్తి కోనేటి మెట్లమీదికి దారి తీసింది. కోనేటి మెట్ల మీదికి రాగానే ఒక్కసారి పరుగెత్తి ఆమె జడ అందుకుని లాగి తూలబడ్డాడు రాజేంద్ర. అలా లాగడంతో వెళ్ళి అతని వళ్ళో పడింది రాధ.

"ఛీ ఛీ ఏంపని రాజూ!"

"ఏంపనా, ఏంపనా" అంటూ లేవబోతున్న ఆమెను మళ్ళా చెయ్యిపట్టుకుని లాగాడు. ఆమె మళ్ళా వళ్ళో పడింది.

వెంటనే రెప్పపాటులో లేచి అతని చెంపకు తన చేయి పరంచేసి ఇంటికి పరుగెత్తింది రాధ.

కంటికి నీరు ఆదేశమగునట్లుగాని, తల తిరిగేంత గాని - పెద్ద దెబ్బ తగల్లేదో ఏమిటో - వెళ్ళిపోతున్న ఆమెను చూస్తూ రాతిబొమ్మైపోయాడు రాజేంద్ర.

ఆ మెట్లమీద చెక్కివున్న హంసబొమ్మ - సరసము విరసము కొరకే, పరిపూర్ణ సుఖంబు లధిక బాధల కొరకే' అని పాడుతూ తనని వెక్కిరిస్తూన్నట్లనిపించింది.

* * *

మర్నాడు సాయంత్రం ప్రసాదు రాజేంద్ర కృష్ణ ఇంటికి వచ్చాడు. గదిలో ఒంటరిగా కూర్చుని, వాడిన మొగంతో, ఏమిటో దీర్ఘంగా ఆలోచిస్తున్న అతన్ని చూచేసరికి నవ్వు వచ్చింది ప్రసాదుకి.

"పద. బంగళాతోటకి అలా షికారు వెళ్ళొద్దాం" అన్న ప్రసాదు మాటలకి రానని చెప్పలేక అయిష్టంగానే లేచాడు. కొంతదూరం నడిచిన తరువాత—

"కోనేటి గాథ చెప్పమంటావా?" అన్నాడు ప్రసాద్.

"వద్దు బాబోయ్, వద్దు. ఆ కోనేటి సంగతి మరెత్తకు" అని వ్యాకులపాటుతో అంటున్న రాజేంద్రను చూస్తూ వస్తున్న నవ్వ ఆపుకున్నాడు ప్రసాద్.

"పోనీ. రాధను పెళ్ళిచేసుకుంటావా?" త్రుళ్ళిపడి అతని మొగంలోకి చూశాడు రాజేంద్ర, ఎవరికీ తెలియదనుకున్న తన ప్రణయం అతనికి తెలిసిపోయినట్టుందే!

"దాచ యత్నించడం అనవసర శ్రమ. చెప్పెయ్" ప్రసాదు హెచ్చరిక.

"చేసుకుంటాను. కాని ఆమె ఎవరో, ఆమె తల్లిదండ్రు లెవరో తెలియదు."

"తల్లిదండ్రులు తెలియకపోయినా అన్న తెలుసునుగా."

"ఎవరు?"

"ఇంకా చెప్పాలా?"

"నువ్వేనా?" అని ఆశ్చర్యం, సిగ్గు అన్నిటితో సతమతమైపోయాడు రాజేంద్ర.

"అవును. నీ కోనేటి ప్రయాణగాథ పిచ్చిని మా ఇంట్లో చెప్పాను. అది మొదలు మా ఇంట్లో నువ్వొక సమస్య వయ్యావు. ముందు ఉదయం వెళ్ళి నీళ్ళు తెస్తున్న మా రాధ సాయంత్రంవేళల్లో వెళ్ళడం మొదలుపెట్టింది. అది చూచి నాకు కలిగిన అనుమానాన్ని ఓరోజు స్థిరంచేసుకున్నాను. దీని ఫలితమేగాని బావుంటే-నీ పిచ్చి, ఆమె పెళ్ళి అనే రెండు సమస్యలు ఒకేసారి పరిష్కారం చేయవచ్చు అనుకున్నాను" అని ఆగి ఒక్కక్షణం రాజేంద్ర మొగంలోకి చూచి మొదలుపెట్టాడు ప్రసాద్.

"నిన్న రాత్రినుంచి రాధ మొగం ఏమీ బాగు లేదు. పరాకు, ఏడుపుమొగం. ఆ పరాకు చూసి మా అమ్మ రెండు మూడుసార్లు తిడితే వెక్కి వెక్కి ఏడ్చేసింది. నిజానికి అమ్మ తిట్టినందుకు ఏడవవలసినది కాదు. కాని కడుపులోవున్న ఏదో దుఃఖాన్ని దీని ఆధారంగా వెళ్ళ గక్కేసింది అనిపించింది. ఇంక వూరుకుంటే లాభంలేదు. ఇవాళేదో తేల్చేయాలి అని ఇలా వచ్చాను." అనేసి మౌనంగా నడవడం మొదలుపెట్టాడు ప్రసాద్.

ఐదు నిముషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

"సరే ఆ మిగిలింది నీ చేత్తో పూర్తిచేసెయి" అన్నాడు బరువుగా రాజేంద్ర.

"ఆ సమయంకోసమే కాచుకు చూస్తున్నాను. పద. మా ఇంటికి వెళ్దాం" అని హైస్కూలు సందులోకి తీసుకుపోతున్నాడు.

ప్రసాదింటికి వెళ్ళడం అదేమొదలు రాజేంద్ర కృష్ణకి. వీళ్ళిద్దర్నీ చూచి వీధిగుమ్మానికి ఆనుకొని, ఒక్కొక్కటే వేరుసెనగగింజలు నోట్లో వేసుకుంటున్న రాధ లోపలికి పరుగెత్తింది.

"కాఫీ తీసుకురా రాధా" అని కేకేసి, గదిలోకి తీసుకుపోయి, అతనికొక కుర్చీ చూపించి తనొక కుర్చీలో కూర్చున్నాడు ప్రసాద్. రాజేంద్రకృష్ణ తల వంచుకొని మౌనంగా కూర్చున్నాడు. పమిట చెంగులో వళ్ళంతా కప్పుకొని రెండు కప్పులతో కాఫీ తెచ్చి టేబిలుమీద పెట్టేసి వెళ్ళబోయిందిరాధ.

"నువ్వుకూడా తెచ్చుకో రాధా!" అన్న ప్రసాదు మాటలకు తనొకకప్పు తెచ్చుకుని అక్కడే వేసివున్న పొడుగాటి బెంచీమీద ఒదిగి తలొంచుకొని కూర్చుని తాగుతోంది రాధ.

ఇద్దరూ భూదేవి ఆకర్షణశక్తిని ఇంకొకసారి నిరూపిస్తున్నట్లుగా తలలు వంచుకోవడం చూస్తే నవ్వొచ్చింది ప్రసాదుకి.

"మీ అపరాధానికి శిక్ష వేస్తానుగాని, తలెత్తండి" అన్నాడు నవ్వుతూ. రాజేంద్ర తమాయించుకుని తలెత్తాడుగాని, రాధ మరీకుంచించుకుపోయింది.

"ఇప్పుడు చెప్పు ఆ కోనేటి గాథ" అన్నాడు గొంతు సరిచేసుకొని రాజేంద్ర. ఇంకా అదేదో వుందనే ఊహతో—

"ఒక్క గాథే ఏమిటి అజ్ఞాతంగా ఎందరు ప్రేయసీప్రియులకు నిలయమయిందో—ఆ కోనేరు. కాని మనకు తెలిసిందిమాత్రం ఒక్కటే—అదే మీ ప్రణయం. ఇదే రసవత్తరంగా రచించి పేరు సంపాదించుకో" అన్నాడు ప్రసాద్.

"బలేమోసం!" నవ్వాడు రాజేంద్ర.

"అలా అనుకుంటే బాధేంలేదుగాని మోసం చేసినా..." అంటూ కళ్ళు రాధ్రపక్క తిప్పి "ఇచ్చానుగా" అనేశాడు.

"థాంక్స్" అనే రాజేంద్ర మాటల్ని వినిపించుకోకుండానే ప్రసాదు "నిముషంలో వస్తా" అంటూ ఇంట్లోకి పరుగెత్తాడు.

నీళ్ళతో నిండిన కళ్ళనెత్తి రాజేంద్రను చూచి-

"నామీద కోపమొచ్చిందా?" అని అడిగింది రాధ. ఆమె మొగం చూచేసరికి అతని మనసు కరిగిపోయింది.

"ఛా ఛా అలాంటిదేంలేదు." అంటూ లేచి ఆమెకళ్ళు తుడవబోయి తటాలున ఆగి—

"అరె ఇప్పుడే తాకకూడదుగా!" అన్నాడు.

"ఆ భయం మరి లేదులెండి." అని నవ్వి అతని చేతితోనే తన కన్నీళ్లు తుడుచుకుంది. అలాగే ఆమెచేతిని గట్టిగానొక్కి తేలికైన హృదయంతో వీధి గుమ్మంలోకొచ్చి "ప్రసాద్ వెళ్తున్నా" అని కేకపెట్టాడు రాజేంద్ర.

★